# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 04-02-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఫిబ్రవరి 7, 8వ తేదీలలో మలేషియాలో పర్యటించనున్నారు.
- ❖ అమెరికాతో వాణిజ్య ఒప్పందం చేసుకున్నప్పటికీ వ్యవసాయం, పాడి రంగాల్లో భారత్ తన ప్రయోజనాలను విస్మరించలేదని కేంద్రమంత్రి పీయూష్ గోయల్ స్పష్టం చేశారు.
- ❖ లోక్‌సభలో విపక్షాలు చేపట్టిన నిరసనలతో సభ ఈరోజు పలు మార్లు వాయిదా పడింది.
- ❖ మణిపూర్ నూతన ముఖ్యమంత్రిగా యుమ్నం ఖేమ్‌చంద్ ఈ సాయంత్రం ప్రమాణ స్వీకారం చేశారు.
- ❖ అండర్-19 వన్డే ప్రపంచ కప్ సెమీఫైనల్ మ్యాచ్‌లో భారత్ విజయం సాధించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = =

మలేషియా ప్రధానమంత్రి అన్వర్ ఇబ్రహీం ఆహ్వానం మేరకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఫిబ్రవరి 7, 8వ తేదీలలో మలేషియాలో పర్యటించనున్నారు. భారత ప్రధానమంత్రి మలేషియాలో పర్యటించడం ఇది మూడవసారి. 2024 ఆగస్టులో భారత్ - మలేషియా ద్వైపాక్షిక సంబంధాలు `సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యం`గా ఉన్నత స్థాయికి చేరిన తర్వాత చేస్తున్న మొదటి పర్యటన ఇది. ఈ పర్యటన సందర్భంగా ప్రధానమంత్రి తన మలేషియా ప్రతినిధితో ద్వైపాక్షిక చర్చలు జరుపుతారని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రవాస భారతీయులతో పాటు పరిశ్రమ వ్యాపార ప్రతినిధులతో కూడా సంభాషిస్తారని పేర్కొంది. 10వ భారత్ - మలేషియా సీఈఓ ఫోరం కూడా ఈ పర్యటనలో భాగంగా జరగనుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = =

అమెరికాతో వాణిజ్య ఒప్పందం చేసుకున్నప్పటికీ వ్యవసాయం, పాడి రంగాల్లో భారత్ తన ప్రయోజనాలను విస్మరించలేదని కేంద్ర వాణిజ్యం, పరిశ్రమల శాఖా మంత్రి పీయూష్ గోయల్ స్పష్టం చేశారు. ఇరు దేశాల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని వాణిజ్య ఒప్పందాలు చేసుకున్నామన్నారు. రాజ్యసభలో ఈరోజు అమెరికాతో

వాణిజ్య ఒప్పందంపై ఆయన వివరణ ఇస్తూ... ఈ ఒప్పందం సూక్ష్మ, చిన్న, మధ్యతరహా వ్యాపారవేత్తలు, MSMEలు, పారిశ్రామికవేత్తలు, నైపుణ్యం కలిగిన కార్మికులు, పరిశ్రమలకు కొత్త అవకాశాలను అందిస్తుందని చెప్పారు. ఈ ఒప్పందం తయారీ రంగాన్ని బలోపేతం చేయడానికి, ఉపాధి అవకాశాలను విస్తరించడానికి, ఆర్థిక వృద్ధిని ప్రోత్సహించడానికి ఉత్ప్రేరకంగా పని చేస్తుందన్నారు. వాణిజ్య ఒప్పందానికి సంబంధించిన ముఖ్యమైన ప్రక్రియలను నెరవేర్చడానికి ఒప్పందం పూర్తి సామర్థ్యాన్ని వీలైనంత త్వరగా పొందగలిగేలా రెండు వైపులా కలిసి పని చేస్తామని పీయూష్ గోయల్ మాట్లాడుతూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = =

పార్లమెంటు ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చేపట్టిన చర్చలో వరుసగా మూడో రోజు కూడా లోక్‌సభ కార్యకలాపాలకు అంతరాయం ఏర్పడంతో సభ పలు మార్లు వాయిదా పడింది. అమెరికా-భారత్ వాణిజ్య ఒప్పందం, చైనాతో సరిహద్దు సమస్యలపై కాంగ్రెస్, డిఎంకె, టిఎంసి, ఇతరులు సహా ప్రతిపక్ష పార్టీలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశాయి. దీంతో లోక్‌సభ మూడుసార్లు వాయిదా పడింది. మూడోసారి వాయిదా తర్వాత సాయంత్రం 5 గంటలకు సభ సమావేశమైనప్పుడు, కాంగ్రెస్, టిఎంసి సహా విపక్ష పార్టీ సభ్యులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ.. వెల్‌లోకి దూసుకెళ్లారు. సభ సజావుగా పని చేయడానికి సహకరించాలని ప్రిసైడింగ్ ఆఫీసర్ నిరసన వ్యక్తం చేస్తున్న సభ్యులను పదే పదే కోరినప్పటికీ ఫలితం లేకపోవడంతో సభాపతి రేపు ఉదయం 11 గంటలకు తిరిగి సమావేశం అయ్యేలా సభను వాయిదా వేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

మణిపూర్ నూతన ముఖ్యమంత్రిగా యుమ్నం ఖేమ్‌చంద్ ఈ సాయంత్రం ప్రమాణ స్వీకారం చేశారు. ఆ రాష్ట్ర రాజధాని ఇంఫాల్‌లోని లోక్ భవన్‌లో మణిపూర్ గవర్నర్ అజయ్ కుమార్ భల్లా ఖేమ్‌చంద్‌తో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో బీజేపీకి చెందిన శాసన సభ్యులు నెమ్చా కిప్‌జెన్, ఎన్‌పిఎఫ్ పార్టీకి చెందిన లోసియి దిఖో ఉప ముఖ్యమంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. అంతకుముందు మణిపూర్‌లో రాష్ట్రపతి పాలనను ఎత్తివేస్తూ.. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఒక గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆ రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన రద్దు ఈ రోజు నుండి అమలులోకి వచ్చింది. గత సంవత్సరం ఫిబ్రవరి 13న మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధించబడింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 356 ప్రకారం మణిపూర్ రాష్ట్రంలో గత సంవత్సరం తాను జారీ చేసిన ప్రకటనను రాష్ట్రపతి ముర్ము రద్దు చేశారని ఆ నోటిఫికేషన్‌లో పేర్కొనబడింది.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = =

జమ్మూ కాశ్మీర్‌లోని ఉధంపూర్ జిల్లాలో ఈరోజు చోటు చేసుకున్న ఎన్ కౌంటర్ లో ఇద్దరు ఉగ్రవాదులు హతమయ్యారు. వారిలో ఒకరు జైషే మహ్మద్‌కు చెందిన అగ్ర కమాండర్ రుబానీ అలియాస్ అబు మావియా కాగా మరొకరు పాకిస్థాన్ జాతీయుడు. అబు మావియా గత కొన్ని సంవత్సరాలుగా ఆ ప్రాంతంలో చురుగ్గా ఉగ్ర కార్యకలాపాలను నిర్వహిస్తున్నాడు. నిన్న సాయంత్రం 4 గంటల సమయంలో రామ్‌నగర్-బసంత్‌గఢ్ ప్రాంతంలో ఉగ్రవాదులున్నారన్న సమాచారంతో సైన్యం, పోలీసులు, సీఆర్‌పీఎఫ్ సంయుక్త బలగాలు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో ఉగ్రవాదులు కాల్పులు జరపడంతో ఎన్‌కౌంటర్ ప్రారంభమైంది. అక్కడి నుండి తప్పించుకొని పారిపోయిన ఉగ్రవాదులు ఉదంపూర్ ప్రాంతంలోని గుహల్లో ఉన్నట్టు ఈరోజు సమాచారం అందడంతో మళ్లీ గాలింపు చేపట్టారు. గుహలో ఉన్న వారిపై కాల్పులు జరపడంతో వారిరువురు హతమయ్యారు. ఘటనాస్థలం నుంచి ఎం4 కార్బైన్ రైఫిల్స్, ఏకే-47 రైఫిల్స్, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ "పరీక్షా పే చర్చా" కార్యక్రమం ద్వారా నేరుగా సంభాషించనున్నారు. పరీక్షలలో సవాళ్లను అధిగమించడం, సమతుల్యతను కాపాడడం, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవడం వంటి వివిధ అంశాలపై విద్యార్థులకు విలువైన సూచనలను అందించేందుకు ఏటా ప్రధానమంత్రి పరీక్షా పే చర్చా కార్యక్రమం ద్వారా విద్యార్థులతో ముచ్చటిస్తున్నారు. అందులో భాగంగానే ఈ నెల 6వ తేదీన పరీక్షా పే చర్చా 9వ ఎడిషన్ ప్రసారం కానుంది. విద్యార్థుల సమస్యలను వింటూ.. వారు వెల్లడించిన అభ్యాసన పద్ధతుల సందేహాలపై తాను చెప్పిన సూచనలు, ఉత్తమ పద్ధతుల గురించి 6వ తేదీ ఉదయం 10 గంటలకు ప్రసరమయ్యే పరీక్షా పే చర్చా కార్యక్రమాన్ని వీక్షించాలని ప్రధానమంత్రి కోరారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

బాల్య వివాహ రహిత దేశంగా భారత్‌ను మార్చాలన్న లక్ష్యంతో చేపట్టిన బాల వివాహ ముక్త్ భారత్ ప్రచార కార్యక్రమానికి దేశవ్యాప్తంగా విశేష సామాజిక స్పందన లభించింది. ఈ ప్రచారం కింద చేపట్టిన అవగాహనా కార్యక్రమాలు 6 కోట్లకు పైగా పౌరులకు చేరువయ్యాయి. బాల్య వివాహ రహిత దేశంగా భారతదేశాన్ని మార్చాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం నవంబర్ 27, 2024న `బాల వివాహ ముక్త్ భారత్` జాతీయ ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించింది. `వికసిత్ భారత్` దార్శనీకతను సాకారం చేసే క్రమంలో `ప్రభుత్వం, సమాజం కలిసికట్టుగా` పనిచేస్తూ.. బాలికలు, మహిళల్లో విద్య, నైపుణ్యం, వ్యాపార సామర్థ్యాలను పెంపొందించటం అత్యంత కీలకం. బాల్య వివాహాల నియంత్రణపై అవగాహన కల్పించటం, తల్లిదండ్రులు, కుటుంబాలు, సమాజాన్ని ఇందులో భాగస్వాములను చేయటం, సకాలంలో బాల్య వివాహాల సమాచారం అందించేలా ప్రోత్సహించటం, బడి మానేసిన, బాల్య వివాహాల ముప్పున్న అమ్మాయిలను గుర్తించి.. చదువు, నైపుణ్య శిక్షణ, సాధికారత అందేలా చూడటం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశాలు. ఈ కార్యక్రమం విజయవంతం కావటంతో ప్రయత్నాలను మరింత పెంచుతూ... 4 డిసెంబర్ 2025న బాల వివాహ ముక్త్ భారత్ ద్వారా 100 రోజుల ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = =

అండర్-19 వన్డే ప్రపంచ కప్ లో సెమీఫైనల్ మ్యాచ్‌లో భారత్ విజయం సాధించింది. అఫ్గానిస్థాన్ నిర్దేశించిన 311 పరుగుల భారీ లక్ష్యాన్ని భారత్ 41 ఓవర్లలోనే ఛేధించింది ఫైనల్‌కు చేరుకుంది. భారత ఓపెనర్ ఆరోన్ జార్జ్ 115, వైభవ్ సూర్యవంశీ 68, ఆయూష్ మాత్రే 62 పరుగులతో రాణించి భారత్‌కు సునాయశ విజయాన్ని అందించారు. దీంతో ఫిబ్రవరి 6న హరారె వేదికగా జరగనున్న ఫైనల్ మ్యాచ్‌లో ప్రపంచకప్ టైటిల్ కోసం ఇంగ్లాండ్‌తో భారత్ పోటీపడనుంది. మరోవైపు నవీ ముంబైలోని డివై పాటిల్ స్టేడియం వేదికగా టీ-20 ప్రపంచ కప్ సన్నాహక మ్యాచ్‌లలో భాగంగా భారత్, దక్షిణాఫ్రికా జట్ల మధ్య టీ-20 క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది. టాస్ గెలిచిన భారత్ 16 ఓవర్లకు 4 వికెట్ల నష్టానికి 201 పరుగులు చేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = =

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు స్వల్ప లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 83 వేల 739 పాయింట్ల వద్ద లాభంతో ప్రారంభమై.. చివరికి 78 పాయింట్ల లాభంతో 83 వేల 817 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 48 పాయింట్లు లాభపడి 25 వేల 776 వద్ద ముగిసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = = = = =